కాలయాపనతో.. హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం



గొడివాడలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, నాయకులు

భోగాపురం: కాలయాపనతో ఎన్నికల హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని భోగాపురం, చాకివలస, నందిగాం, ముంజేరు, సుందరపేట, గొడివాడ, రాజాపులోవ గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఏడాది కాలంగా పథకాలేవీ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఆ తర్వాత జరిగిన సమావేశాల్లో చంద్రబాబు మోసపూరిత పాలనపై ధ్వజమెత్తారు. ఎన్నికలప్పుడు లేనిపోని హామీలతో ప్రజలను ఊదరగొట్టి ఓట్లు వేయించుకుని, తీరా అధికారం వచ్చాక ప్రజలకు ఇచ్చిన మాటను విస్మరిస్తూ వారిని మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని వైఎస్సార్ సీపీ బాధ్యత గల ప్రతిపక్షంగా ఒత్తిడి చేస్తేనే గ్యాస్, తల్లికి వందనం పథకాలు అరకొరగానైనా ప్రజలకు అందాయన్నారు. ఇప్పటికీ చాలామందికి గ్యాస్ డబ్బులు, తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. కొంతమందికి ఆ డబ్బులు పడినా హెచ్చుతగ్గులుగా ఉన్నాయన్నారు. ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని నిలదీశారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులు..

ఏ పథకం అమలు చేయాలని అడిగినా చేస్తాం..సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడును ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారని అడిగితే ఆ పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సిందేనని ఆయన అనడం దుర్మార్గమన్నారు. హామీలు ఇచ్చినప్పుడు తెలీదా ఆ పథకం అమలు చేయలేమని..ఇలా అమలు సాధ్యం కాని హామీలిచ్చి ఇప్పుడు చేతులెత్తేయడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఈ విధంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని అడిగిన వారిపై రాజకీయ కక్షలకు దిగుతున్నారని, అన్యాయంగా అరెస్టులు చేసి జైలుపాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కూటమి సర్కారు వల్ల ప్రజలకు జరిగిన మంచి ఏమీ లేదని, రాష్ట్ర అభివృద్ధి కూడా శూన్యమన్నారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ హయాంలోనే శంకుస్థాపన జరిగిందని, కూటమి ప్రభుత్వం మళ్లీ అదే నిర్మాణానికి శంకుస్థాపన చేసి హడావిడి చేస్తుండడం సిగ్గుచేటన్నారు. అమరావతి అభివృద్ధి పేరిట సీఎం చంద్రబాబు నాటకాలు ఆడుతున్నారని, ఒక ప్రాంతానికి అభివృద్ధిని పరిమితం చేయడాన్ని అందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు తెలుసుకుంటున్నారని, కూటమి చేస్తున్న మోసాలకు రాబోయే రోజుల్లో వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భోగాపురం, నెల్లిమర్ల మండలాల కన్వీనర్లు యు.సూర్యనారాయణరెడ్డి, జి.సన్యాసినాయుడు, హౌసింగ్ బోర్డు రాష్ట్ర మాజీ డైరెక్టర్ యు.శివారెడ్డి, వైస్ ఎంపీపీలు ఆర్.బాబు, పి.నాగలక్ష్మి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ఎస్.హరీష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బి.ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు యు. విజయభాస్కర్ రెడ్డి, యు.అప్పయ్యమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పి.తాతయ్యలు తదితరులు పాల్గొన్నారు.

• నమ్మించి మోసగించడం దుర్మార్గం..



విజయనగరం: 11వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మేయరు విజయలక్ష్మి, నాయకులు

విజయనగరం: ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించడం దుర్మార్గమని, ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి హామీని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని మున్సిపల్ కార్పొరేషన్ మేయరు వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగర పరిధిలోని 11, 12, 40వ డివిజన్‌లలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, కూటమి మోసపూరిత పాలనను ప్రజలకు వివరించారు. అధికారం కోసం నోటికి వచ్చిన హామీలన్నీ ఇచ్చి, ఇప్పుడు అవి అమలు చేయకుండా ఉండడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. కూటమి పాలనతో రాష్ట్రంలోని ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో నెలకొన్న అశాంతి వాతావరణాన్ని ప్రపంచమంతా చూస్తోందన్నారు. అధికార పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు, కేసులతో వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జి.నారాయణరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బంగారునాయుడు, కార్పొరేటర్లు ఆర్.రూపాదేవి, బి.ధనలక్ష్మి, బి.భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'రెడ్‌బుక్'తో బెదిరింపులు..

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి అక్రమాలు ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారు. ఇప్పటికే చాలామంది ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై అక్రమ కేసులు పెట్టారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి మాటలు నమ్మి ఓట్లు వేసిన జనమంతా వారిని నిలదీయాలి. అప్పుడే ఎన్నికల హామీలు అమలు సాధ్యం. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ ఎప్పుడూ పోరాడుతుంది.

– శెట్టి వీరవెంకటరాజేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు

కూటమి మోసాలు వివరించాలి..

కూటమి ఏడాది పాలన దాటినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. ఇప్పటివరకు ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం పథకాల్లోనూ లబ్ధిదారులకు అన్యాయమే జరిగింది. ఇప్పటికీ కొంతమందికి ఆ పథకాల డబ్బులు పడలేదు. మిగిలిన పథకాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. కూటమి మోసాలు ఇంటింటికీ వెళ్లి వివరించాలి. సీఎం చంద్రబాబు మోసపూరిత పాలన పట్ల ప్రజలను చైతన్యవంతం చేయాలి. వారే వారికిచ్చిన హామీలపై నిలదీసేలా చూడాలి.

– ఆశపు వేణు, పార్టీ నగర అధ్యక్షుడు

క్లుప్తంగా

సకాలంలో చికిత్స చేయించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: హెపటైటిస్ వైరస్‌తో బాధపడేవారు సకాలంలో చికిత్స చేయించుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడు సూచించారు. ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెపటైటిస్‌లో హెపటైటిస్–ఎ, బి వైరస్‌లు ఉంటాయని, ఏ వైరస్ దేని వల్ల వస్తుంది, ఎలాంటి బాధలు ఉంటాయన్న విషయాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. ప్రతిరోజూ తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి, నోడల్ అధికారి డాక్టర్ హేమలత, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రమణి తదితరులు పాల్గొన్నారు.

విత్తనబంతుల తయారీపై అవగాహన



విత్తనబంతుల ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: స్థానిక కోట జంక్షన్ వద్ద మహారాజా ఫార్మసీ కళాశాల విద్యార్థులు విత్తనబంతుల తయారీ, దాని ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. బంకమట్టి, వర్మీకంపోస్టు, విత్తనాలు, నీరు కలిపి తయారు చేసుకున్న విత్తన బంతులను పొలాల్లో వేసుకుంటే మొలకశాతం బాగుంటుందని తెలిపారు. అలాగే చీడపీడలు, వ్యాధుల బారి నుంచి పంటమొక్కలు తప్పించుకోగలవన్నారు. నేలసారవంతానికి, జీవవైవిధ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఈ విత్తన బంతులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితం నాశనం చేసుకోవద్దు



ర్యాగింగ్ వల్ల ఎదురయ్యే సమస్యలు తెలియజేస్తున్న సెంచూరియన్ రిజిస్ట్రార్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ పల్లవి సూచించారు. మండలంలోని టిక్కలి సెంచూరియన్ వర్సిటీలో ర్యాగింగ్..దాని వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎవరికైనా ర్యాగింగ్ చేస్తే ఏ చట్టాలు అమలై ఎలాంటి శిక్షలు అమలవుతాయన్న దానిపై అవగాహన లేకపోవడంతోనే పలువురు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని ఆమె తెలిపారు. చేసిన తప్పు బట్టి ఆరు నెలల నుంచి పదేళ్ల జైలుశిక్ష ఉంటుందని, ప్రతిఒక్కరూ చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల లీజు మూడేళ్లుగా నిర్ణయించాలి



మాట్లాడుతున్న జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు చిన్నప్పన్న

విజయనగరం అర్బన్: చేపల చెరువుల లీజు కాలపరిమితి మూడేళ్లుగా నిర్ణయించాలని జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన సంఘ పాలకవర్గ సభ్యులతో కలిసి కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని చిన్న నీటి వనరులకు డివిజనల్ పంచాయతీ అధికారులు లీజు ఆర్డర్లు ఏడాదికి మాత్రమే ఇస్తామని చెబుతున్నారని దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కనీసం మూడు సంవత్సరాల లీజు కాలపరిమితి లేకపోతే నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

వర్క్‌షాపు ప్రారంభం

విజయనగరం అర్బన్: నగరంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంప్లాయబిలిటీ మరియు సాఫ్ట్ స్కిల్స్‌పై వారం రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ ఈ ఆధునిక ప్రపంచంలో విద్యతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రతిభ, వ్యక్తిత్వం కూడా ముఖ్యమేనన్నారు. ప్రతి విద్యార్థి ఈ వర్క్‌షాపులో నేర్పించే అంశాలను చక్కగా నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీ సాయిదేవమణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



పూసపాటిరేగ: రాజేష్ ట్రేడర్స్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు



విజయనగరం ఫోర్ట్: రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు



నెల్లిమర్ల: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

డెంకాడ: మండల కేంద్రంలోని సాయికృష్ణ రైతుమిత్ర గ్రూపు, పీఏసీఎస్ ఎరువుల షాపుల్లో అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసీల్దారు ఎం.రాజారావు, ఏడీఏ ఎ.నాగభూషణం, ఏవో సంగీతలు ఎరువుల నిల్వలు, వాటి రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో పేర్కొన్న విధంగా ఎరువుల నిల్వలు, విక్రయాలు ఉన్నవీ లేనివీ సరిచూశారు. అనంతరం పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరకు విక్రయించినా, నాసిరకం ఎరువులు ఇచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఈవో రామకోటి పాల్గొన్నారు.


పూసపాటిరేగ: మండలంలోని ఎరువుల దుకాణాల్లో మండల ప్రత్యేకాధికారి ఆర్.వెంకటరామన్, మండల వ్యవసాయాధికారి కె.నీలిమలు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పురుగుమందు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లు, కంపెనీ ఇన్‌వాయిస్‌లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎంఆర్‌పీ కన్నా పైసా ఎక్కువ ధరకు విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నెల్లిమర్ల: పట్టణంలోని ఎరువుల షాపుల్లో మండల ప్రత్యేకాధికారి మురళీమోహన్, ఏడీ కోటేశ్వరరావు, ఏవో శ్రీలక్ష్మిలు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

6ఏ కేసు నమోదు..

విజయనగరం ఫోర్ట్: నగరంలోని మేదర వీధిలో ఉన్న మాత వేంకటేశ్వర ఎరువుల దుకాణంలో జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. షాపులో ఉండాల్సిన ఎరువుల కన్నా ఎక్కువ ఎరువులు ఉండడంతో 6ఏ కేసు నమోదు చేసి, జరిమానా విధించారు.

శిథిలావస్థలో చింతపల్లి సచివాలయం



పూసపాటిరేగ మండలం, చింతపల్లి సచివాలయం సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ కార్యాలయ భవనంలోనే సచివాలయం1, 2లను నిర్వహిస్తుండడంతో అది ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో ఉద్యోగులు పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే శ్లాబ్ పెచ్చులూడుతుండగా రోజూ కురుస్తున్న వర్షాలకు ఏ క్షణాన్నైనా భవనం పడిపోవచ్చన్న ఆందోళన ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. కొత్త సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– పూసపాటిరేగ

దరఖాస్తు చేసుకోవాలంటే.. ఎండలో ఉండాల్సిందే!



ఈ చిత్రంలో కనిపిస్తోంది..కలెక్టరేట్ ఆవరణలోని ఫిర్యాదుదారుల దరఖాస్తు రాసే విభాగం. సాధారణంగా ఇది కలెక్టరు కార్యాలయ భవనంలోని ఏదో ఒకచోట నీడ ప్రదేశంలో నిర్వహించాలి. అయితే సోమవారం కలెక్టరేట్ వద్ద బయట ఎండలో దరఖాస్తులు రాసే విభాగం నడిపారు. అధికారులకు తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారంతా ఇలా ఎండలో గంటల తరబడి వేచి ఉండి దరఖాస్తు రాయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిలో ఎక్కువ మంది వృద్ధులు, దివ్యాంగులే ఉండడంతో వారంతా ఎండలో ఉండేందుకు అవస్థలు పడ్డారు. కాసేపు అక్కడే వేచి ఉండి మరికొంతసేపు అక్కడే ఏదో ఒక చెట్టు నీడన చేరి సేదతీరాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నేడు కౌన్సిల్ సమావేశం

నెల్లిమర్ల రూరల్: మండల కేంద్రంలో నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జయరాం ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా వస్తున్నారని, అధికారులు కూడా తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ముగ్గురు గంజాయి నిందితుల అరెస్ట్





గంజాయితో అరెస్ట్ అయిన నిందితులు



విజయనగరం క్రైమ్: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. స్టేషన్ పరిధిలో దాసన్నపేట, లంకవీధి, జొన్నగుడ్డిలకు చెందిన రవితేజ, తేజ, దుర్గా ప్రసాద్‌లు గంజాయి అక్రమ రవాణ చేస్తుండగా వ్యాసనారాయణ మెట్ట వద్ద ఎస్సై మురళి అదుపులోకి తీసుకున్నారన్నారు. స్టేషన్‌కు తీసుకొచ్చిన పూర్తిస్థాయిలో విచారణ చేసి నాలుగున్నర కేజీల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాస్ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని చెప్పారు.

విద్యుత్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్‌శాఖ కార్మికులు

డెంకాడ:

ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. పెదతాడివాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని కలిసి గోడు వినిపించారు. 2022 పీఆర్‌సీ ఎరియర్స్ ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. బేసిక్ పే రూ. 46వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు కోటి రూపాయల ఇన్సూరెన్స్ కట్టాలని, అన్‌లిమిటెడ్ హెల్త్‌కార్డులు అందించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10లక్షలు మంజూరు చేయాలని కోరుతూ విద్యుత్ కార్మికులు కె. ఆదినారాయణమూర్తి, ఎం.శ్రీనివాస్, తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

కుటుంబాల దత్తత ఒత్తిడి మానుకోవాలి



డీఈవో మాణిక్యంనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ జిల్లా కమిటీ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: పీ4 సర్వే, మార్గదర్శి–బంగారు కుటుంబం పథకంలో భాగంగా ప్రతి ఉపాధ్యాయుడు ఓ నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని చేసే ఒత్తిడి మానుకోవాలని ఆపస్(ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) జిల్లా కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు. ఇదే విషయమై జిల్లా కేంద్రంలో డీఈవో యు.మాణిక్యంనాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల కొత్తగా బదిలీ అయిన సిబ్బందికి, పదోన్నతులు పొందిన వారికి రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. జాప్యం చేయకుండా పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, ఒకటే యాప్ కిందకు అన్ని సర్వీసులు తీసుకురావాలన్నారు. డీఈవోను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇజ్జపు రామునాయుడు, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బల్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎం.వెంకటనాయుడు, ఆర్.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవం



విజయనగరం టౌన్: గోదాదేవికి పూజలు చేస్తున్న వేదపండితులు



నెల్లిమర్ల రూరల్: గోదాదేవి తిరునక్షత్ర పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తుడు

విజయనగరం టౌన్: శ్రావణ శుద్ధ దశమి, గోదాదేవి జన్మదినం పురస్కరించుకుని, స్థానిక మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిహారం మణిబాబు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో వెయ్యి మందికి పైగా మహిళా భక్తులు పాల్గొని, విశేష కుంకుమార్చనలు చేశారు. పూజలకు అవసరమైన సామగ్రిని మంచుకొండ ఆళ్వార్ కుటుంబ సభ్యులు ఉచితంగా అందజేశారు.

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం చేసినానంతరం యాగశాలలో సుందరాకాండ హవనం, ఆస్థాన మండపంలో సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం గోదాదేవికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

అధ్వానంగా ప్రభుత్వ వసతిగృహాలు



హాస్టల్ విద్యార్థుల సమస్యలపై మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన విద్యార్థి విభాగం ఇన్‌చార్జ్ ఈశ్వర్ కౌశిక్



విద్యార్థుల వసతిగృహంలో సౌకర్యాలు పరిశీలిస్తున్న ఈశ్వర్ కౌశిక్

విజయనగరం టౌన్: ప్రభుత్వ వసతిగృహాలు అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ యువజన విద్యార్థి విభాగం ఇన్‌చార్జ్ ఈశ్వర్ కౌశిక్ అన్నారు. నగరంలోని ఏడో డివిజన్ దాసన్నపేట, 31వ డివిజన్ పద్మావతినగర్‌లోని బీసీ బాలురు వసతిగృహాలను ఆయన సోమవారం సందర్శించారు. హాస్టళ్ల పరిసరాలు పరిశీలించడంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాసన్నపేట హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉందని, మరుగుదొడ్లు, స్నానపుగదులు అపరిశుభ్రంగా ఉన్నాయని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే హాస్టళ్లలో ఈ దుస్థితి నెలకొందని ఆరోపించారు. వసతిగృహాల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు వినతిపత్రం అందించడం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నామన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, యువజన విభాగం నాయకులు భార్గవ్, పవన్, సురేష్ తదితరులు ఉన్నారు.